# మేడిపండు



## రమాపతి

"నాన్నగారూ, మీకు బొంబేనుండి ఉత్తరం."

తీయదనం నింపుకొన్న కంఠంతో పలుకుతూ కోమలి లోపలికి వచ్చింది.

రెండు మూడు రోజుల్లో టేకప్ చేయబోయే ఆపరేషన్‌కోసం స్పెషల్ స్టడీ చేస్తున్నవాడల్లా, కళ్లద్దాలు సవరించుకుంటూ ఆసక్తిగా తల ఎత్తి చూశాడు డాక్టర్ రమేష్. కోమలి ఉత్తరం అందించింది.

ఉత్తరం చేతిలోకి తీసుకుని ముందు, వెనక తిప్పి చూసి గబగబా కవరు చించి మడతలు విప్పి చదవ సాగాడు.

"శ్రీయుతులు రమేష్‌గారికి,

అఖిల భారత సాహిత్య (సదస్సు) వారోత్సవాలను పురస్కరించుకొని జరిపిన కథానికా పోటీలో మీరు పంపిన "పాలూ, నెత్తురూ . . ." అన్న కథకు ప్రథమ బహుమతి లభించిందని తెలుపటానికి ఎంతో సంతోషిస్తున్నాం. మీరు వ్రాసిన కథ వినూత్న శైలిలో ఉంది. మీరు సృష్టించిన స్త్రీ పాత్ర అమోఘంగా ఉంది. శిల్పంలో సరికొత్తదనం ఉంది. మీకు మా సాహిత్య సదస్సు తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు. వచ్చే సోమవారం మీకు సన్మానం జరిపించ దలుచుకున్నాం. రెండు రోజులు ముందుగానే

బయలుదేరి మా ఆతిథ్యం స్వీకరించవలసినదిగా మా ప్రార్థన.

భవదీయుడు,
రజనీకాంత్,
కార్యదర్శి, ఆ. భా. సాహిత్య సదస్సు,
తెలుగు విభాగం, బొంబాయి.''

ఉత్తరం ముగించేసరికి డాక్టర్ రమేష్ సన్నటి సిగెరెట్ పెదాలపై చిరునవ్వు తొణికిసలాడింది. తృప్తిగా నిశ్వసిస్తూ పట్టరాని సంతోషంతో కోమలి వీపు చరిచాడు.

''అమ్మడూ, నా కథకు ఫస్ట్ ప్రైజ్ వచ్చిందిట. బొంబేలో సన్మానంగూడా ఏర్పాటుచేశారట. ఆ కథకు పేరు సూచించినందుకు సగం కీర్తి నీకు దక్కాలి . . !'' అన్నాడు ఉత్సాహంగా.

''కంగ్రాచులేషన్స్, డాడీ!'' అంటూ కోమలి నాన్న వద్దనుండి ఒక షేక్ తీసుకొని ఇంట్లో ఈ వార్త అందరికీ వినిపించి ముగ్ధుల్ని చేయాలనే ఆత్రతతో గబగబా పరిగెత్తింది.

డాక్టర్ రమేష్ ఆ ఊళ్ళో కల్లా పేరుమోసిన డాక్టరు. ఆదర్శభావాలు గల వ్యక్తి అనీ, పేషెంట్సుని ఎంతో ఓపిగ్గా చూస్తాడనీ, జబ్బుకు కీలెరిగి వాత పెట్టడంలో ఘటికుడనీ ఆయనకు ప్రతీతి.

ఒక్క వైద్యంలోనేగాక, సాహిత్యంలోకూడా బాగా కృషిచేశాడు. కాలేజీ చదివే రోజులనించికూడా కథలు రాస్తూండేవాడు. సాంఘికమయిన ఇతివృత్తాలతో, నిజాయితీగా, వాస్తవానికి సన్నిహితంగా కథలు వ్రాయడంలో సిద్ధహస్తుడనే పేరు అచిరకాలంలోనే సంపాదించాడు. కాలేజీ చదువు ముగించి, డిగ్రీ పొంది ప్రాక్టీసు పెట్టిన తరవాతకూడా తన సాహిత్య కృషి వదులుకోలేదు. తీరిక దొరికినప్పుడల్లా ఏదో కథాంశం వృత్తి గూర్చి, పాత్రలనుగూర్చి, వాటి మనో భావాల్నిగూర్చి ఆలోచిస్తూ ఉండేవాడు.

స్వతహాగా అందగాడేమీ కాకపోయినా, చక్కని అనువైన సౌష్ఠవం, ఆరోగ్యం గల శరీరం. వయస్సు సంభై దాకా ఉంటుంది. పండిన అనుభవాలకు చిహ్నంగా తలలో అక్కడక్కడా వెంట్రుకలు తెల్లగా మెరుస్తూంటాయి. చూసేవాళ్ళకు చురుక్కుమనిపించే చూపు, భావాల్ని స్పష్టంగా ప్రకటించగల ముఖం — చక్కని విశాలమైన దుస్తుల్లో ఎప్పుడూ టిప్‌టాప్‌లో చూపరులకు ఏదో వింత ఆకర్షణ అతనిలో ఉందని పించేలా కన్పిస్తాడు.

నాటకాలద్వారా, కథారచనద్వారా అతనికి అప్పట్లో ఎంతోమంది స్త్రీ, పురుషులతో స్నేహం ఏర్పడింది. రమేష్ తమతో ఆప్యాయంగా ఒక్క మాట మాట్లాడితే చాలు అనుకునే అమ్మాయిలుకూడా లేకపోలేదు అప్పట్లో.

ఈ జీవితంలో ఎన్నో అమూల్యమైన విషయాల్ని నేర్చుకున్నాడు రమేష్. ఏ చదువులవల్లా నేర్చుకోలేని ఎన్నో అనుభవాల్ని గడించాడు. ఎవ్వరితో ఎలా మెలగాలో తెలుసుకున్నాడు. అనుభవాలేకాక, కావలసినంత డబ్బూ హోదా, గౌరవంకూడా సంపాదించాడు. ఇప్పుడు ఇద్దరు కూతుళ్ళూ, ఒక కొడుకూ — వీళ్ళతో హాయిగా కాలం గడుపుతున్నాడు.

సాహిత్యపరంగా రమేష్ ఎన్నో కథలు వ్రాశాడు. అతని కథలు ప్రచురించని పత్రిక తెలుగులో లేదంటే అతిశయోక్తి కాదు. తిండికీ, బట్టకు కరువై నికృష్ట జీవనం గడిపే దౌర్భాగ్యుల జీవితం కళ్ళకు కట్టేట్లు చిత్రించాడు. ఆధునిక సమాజంలో పేదవాడు నిరంతరం ఎట్లా దోచుకోబడుతున్నాడో, ధనికు డెట్లా దినదిన ప్రవర్ధమానుడవుతున్నాడో అనేక రకాలుగా చిత్రిస్తూ వ్రాశాడు. వ్యభిచార గృహాల్లో వినిపించే మూల్గులు, అస్పష్ట ఆక్రందనలు — వీటిమీద కథలు రాశాడు. వాటికి పరిష్కారం చూపించాడు. అనేక రకాలైన మనస్తత్త్వాలు గల పాత్రల్నీ, మరిచి పోలేని పాత్రల్నీ సృష్టించాడు. జీవితంతో తలపడలేని అసమర్థుడైన భర్త ప్రసాదించే దెబ్బలకు ఓర్చుకోలేక ఎవడితోనో లేచిపోయిన ఇల్లాలి కథ వ్రాశాడు. సమాజానికి తలబగ్గి నామరూపాలు లేకుండా పోయిన స్త్రీల కథలు వ్రాశాడు. సంఘానికి ఎదురుతిరిగి యుద్ధం ప్రకటించిన వారిమణుల కథలెన్నో వ్రాశాడు. గుమాస్తా పెళ్ళాం బాధ, ఆఫీసరు దౌర్జన్యం, కాలేజీ అమ్మాయి, అబ్బాయిల అపమర్యాద ప్రేమకలాపాలు . . . ఒకటేమిటి, రమేష్ తడవని సమస్యే లేదు. ఫలితంగా, నవసమాజ నిర్మాణంలోనూ, అభ్యుదయ రచయితల్లోనూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు.

> పాలు ఎంత తెల్లగా ఉంటాయో, నెత్తురు అంత ఎర్రగా ఉంటుంది. పసివారిలో నెత్తురు పెరగడానికి పాలే ఆహారం ... రచయితలు పసివారితో సమానం ... పాలు తాగి రక్తపుష్టి చేసుకునేవారు కొందరైతే, రక్తంతాగి, పాలు కక్కేవారు కొందరుంటారు. మనిషిలో మనిషికీ, పైకి కనిపించే మనిషికి ఎప్పుడూ వ్యత్యాసం వుంటుంది.

తను కలంపట్టి వ్రాయడం మొదలుపెట్టినప్పటి నుండీ అనేక వందల ఉత్తరాలు వచ్చాయి, తన కథల్ని మెచ్చుకుంటూ, విమర్శిస్తూ, సలహాలిస్తూ. తీరిక దొరికినప్పుడల్లా తను వాటిని ముందువేసుకొని, గతించిన కాలాన్ని, కాలం మోసుకువచ్చిన అనుభూతుల్ని తల్చుకొని అనిర్వచనీయమైన ఆనందం పొందేవాడు. ఏ రచయితకైనా అంతకన్నా కావలసిన దేముంది? తన కృషి వ్యర్థంకాలేదు. ఉత్తరాలు చదువుతున్నప్పుడు కలిగే ఆనందం, తృప్తి వర్ణనాతీతం. కానీ వాటిల్లో ఒక్క ఉత్తరంలోని పలుకులుమాత్రం ములుకుల్లా గుచ్చుకుంటూఉంటాయి. తనపైన కిట్టనివాళ్లెవరో ఆరోపణ చేసినట్లుగా ఉంది. అది చదివినప్పుడు హృదయం బాధతో నిండిపోతుంది. ఏదో కెలికినట్లుంటుంది హృదయంలో.

అందులో —

''ఆర్యా! మీ కథలు నేను చాలాకాలంగా చదువుతూ వస్తున్నాను. మిమ్మల్ని నేను ఎరుగుదును. కానీ, నే నెవరో తెలియజేయడం. . . అనవసరం. మీ వ్యక్తిత్వం మీరు వ్రాసే కథలకు భిన్నంగా ఉంటుంది. మీరు కథలు వ్రాయడం మానేస్తే ఎందుకైనా మంచిది.

సెలవు.''

ఇంతమాత్రమే ఉం దా ఉత్తరంలో. ఏదో బెదిరించినట్లుగా ఉంది. ఎంత ఆలోచించినా ఎవరు వ్రాసి ఉంటారో ఊహించుకోలేకపోయాడు. కానీ ఆ ఉత్తరం చదవటం తటస్థించినప్పుడుమాత్రం క్షణమాత్రం అతని ముఖం కాంతిహీనమైపోతుంది.

ఆ రోజు సాయంత్రం ఏదో కేసు చూసుకొని ఇంటికి వచ్చేటప్పటికి గంట దాదాపు ఎనిమిది కావస్తూ ఉంటుంది. ఇంట్లో లైట్లన్నీ ఆర్పేశారులా ఉంది. వరండాలోమాత్రం నీలిరంగు బల్బు కాంతిహీనంగా వెలుగుతూంది. కారు గారేజీలో పెట్టి, లాక్ చేసుకొని తాళంచెవి జేబులో వేసుకొని మెట్లెక్కి వస్తూండగా, కునికిపాట్లలోంచి మేల్కొన్న కుక్ నాయర్ డాక్టర్ రమేష్ చేతికి చీటీముక్క అందించాడు.

''డాడీ! మీకోసం చాలాసేపు చూశాం. రాలేదు. అమ్మా, నేనూ, కమలిని 'ది సోల్జర్స్ ఫాదర్' పిక్చరుకి వెడుతున్నాం. భోజనానికి అన్నీ సిద్ధంగా ఉంచాం. భోంచేయండి — కోమలి.''

చదివి మడిచి జేబులో పెట్టుకుంటూ, 'ఏమిటో ఎప్పు డీ ప్రోగ్రాం వేస్తారో అంతుచిక్కనివ్వ రీ పిల్లలు' విసుక్కుంటూ లోనికి వెళ్ళాడు. స్నానంచేసి నాయరు వడ్డించిన భోజనం చేసి వరండాలో నీలం బల్బుకింద ఈజీఛేర్లో జారగిలబడి సిగరెట్టు ముట్టించాడు. బయట సన్నగా జల్లు ప్రారంభమయింది. డాక్టర్ రమేష్ మన సిప్పుడు చాలా నిర్మలంగా, హాయిగా ఉంది. శరీరం తేలిగ్గా గాలిలో తేలిపోతున్నట్లు ఉంది. మెల్లిగా చలిమిరి గాలి ప్రారంభమయింది. సిగరెట్ పొగ గాలిలోకి వదులుతూ ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. తన జీవిత గమనాన్ని నెమరువేసుకుంటున్నాడు. తను దుర్భర దారిద్ర్యంలో గడిపిన రోజులు, స్కూలుఫీజు, కాలేజీ ఫీజు చెల్లించడానికి డబ్బు లేక అవస్థపడిన రోజులు, తిండి లేక మంచినీళ్ళు తాగి కడుపులో కాళ్ళు పెట్టుకొని రేపటిమీది ఆశతో పడుకున్న రోజులు జ్ఞాపకం వచ్చి కళ్ళు చెమర్చాయి. ఆ రోజుల్లో ధనవంతుల్ని చూస్తే విపరీతమైన అసహ్యం, క్రోధం ఉండేవి. తానుగూడా ఏదో రోజు లప్పక ధనవంతుడై తన లేమిలేటుల్ని నిరూపించాలనీ, జీవితం అనుభవించాలనీ కలలు కనేవాడు. తన జీవితంలో జరిగిన సంఘటనలు ఒక్కటొక్కటిగా తెరలు తెరలుగా కళ్ళముందు జారిపోతున్నాయి.

ఎన్నో దుర్భర క్షణాలు! . . . ఎన్నో మధుర క్షణాలు . . . ఎన్నో మలుపులు... బాధలు, దుఃఖాలు... సుఖాలు — జీవితంమీద రోత . . . మళ్ళీ జీవించాలనే వాంఛ! . . . ఏదో మలుపులో రమేష్ క్షణంసేపు కళ్ళు చికిలించి, బొమముడి కుదించి ఆలోచించాడు. ముఖం జేవురించి కాంతిహీనమైపోయింది.

ఆ మలుపేమిటో! ఆ బాధేమిటో! ఆ మలుపు తరవాత ఎన్నో మలుపులు. . . పెళ్ళి . . . పై చదువు . . . డబ్బు సంపాదన . . . సాహిత్యం. . . పేరుప్రతిష్ఠలు. . . ఇవన్నీ మెదులుతున్నాయి.

రోడ్డుపక్క చెట్టుక్రింద ముసిలాడు చలికి వణుకుతూ 'ఛీ ... ఛీ ... దిక్కుమాలిన బతుకు'

అనుకున్నాడు. . . టపటప కొట్టుకొంటున్న పిట్ట రెక్కల చప్పుడు. . .

వరండాలో తీగలతో వ్రేలాడదీసిన తొట్లలోని పూల పరిమళాలు. క్రోటన్స్ మీద ముత్యాల్లా మెరిసే నీటిబొట్ల స్వచ్ఛందత . . . నీలిమలు చింపుతున్న ఎలెక్ట్రిక్ బల్బు . . . సన్నగా చినుకుల చప్పుడు. . . ఎప్పటికీ జీవించి ఇలాగే ఉండిపోతే బావుండుననిపించేలా ఉంది. రమేష్ ఏవో వింతలోకాల్లో విహరిస్తున్నాడు.

చలిగాలి రివ్వున వీచింది! . . . లెక్కచేయకుండా అలాగే కూర్చొనిఉన్నాడు రమేష్. ఇంతలో మెయిన్ గేటు తీసిన చప్పుడయింది. 'సినిమాకి వెళ్ళినవాళ్ళు అప్పుడే వచ్చారేమిటా?' అని తల ఎత్తి చూశాడు. కాదు, అస్పష్టంగా ఓ ఆకారం వానచినుకుల్లో తడుస్తూ రావడం గమనించాడు. రమేష్ కళ్ళద్దాలు సవరించుకున్నాడు.

సమీపానికి వచ్చినంతవరకు స్త్రీ ఆకారంగా గుర్తించలేదు రమేష్. అలా ఏవేళ బడితే ఆవేళ తన ఇంటికి మనుషులు వస్తూ ఉండటం తను డాక్టరు కనక మామూలే!

ఆ స్త్రీ మెట్లకు సమీపంలో తలమీద ముసుగు వేసుకొని క్రీనీడలో నిలబడిఉంది.

"ఏం కావాలమ్మా . . . ?" అడిగాడు రమేష్.

ఆ స్త్రీ కొంచెంసేపు స్తబ్ధుగా రమేష్‌వంక రెప్ప వాల్చకుండా చూసింది. తరవాత "డాక్టర్ రమేష్ కావాలి" అంది.

"నేనే డాక్టర్ రమేష్‌ని ... ఏం కావాలో చెప్పండి." అడిగాడు పడకకుర్చీలోంచి లేస్తూ.

"డాక్టర్ రమేష్ మీరే నన్నది నాకు తెలుసు. నాకు తెలిసినంత బాగా బహుశా ఎవ్వరికీ తెలిసిఉండదేమో!" ఆ స్త్రీమూర్తి కంఠం హీనస్థాయిలో జబ్బుపడ్డ వ్యక్తి గొంతుకలా ఉంది.

ఈ అనుకోని సమాధానానికి విస్మయపోయాడు రమేష్.

ఆ మాట అంటూ ఆమె మెట్లెక్కి క్రీనీడలోంచి వెలుగులోకి వచ్చింది. రెప్పపాటుకాలం ఆమెవంక నఖశిఖపర్యంతం చూశాడు.


క్షణంలో అతని ముఖంలో ఎన్నో రంగులు మారి పోయాయి. ప్రకృతి స్తంభించిపోయినట్లు ఊపిరి ఆడలేదు.

గొంతుకలోనుండి మాటలను కష్టంగా పెగుల్చు కుంటూ "నువ్వా ... జా ... న ... కీ ... !" అన్నాడు.

ఆమె ముఖం, చెక్కిళ్ళు పాలిపోయి ఉన్నాయి. ఏదో తీవ్ర రోగంతో బాధపడుతూ ఉన్నట్లుంది. మరీ సన్న బడిపోవడంవల్ల సన్నగా గోంగూరకాడలా పొడుగ్గా కనిపిస్తోంది. కాళ్ళకు ఏ విధమైన పాదరక్షలు లేవు. తలవెంట్రుకలమీద జారిపోయిన వాన చినుకులు వెలుగులో మెరుస్తున్నాయి.

"అవును. . . నేనే! మీరు నన్ను మరచిపోయి ఉంటారనుకున్నాను. పేరుకూడా జ్ఞాపకం ఉండటం ఆశ్చర్యమే!!" అం దావిడ.

జీవితపు పోరాటంలో నలిగిపోయింది జానకి! ఆమె కళ్ళు అనుభవాలకు చెందిన జ్ఞానంతో వింతగా మెరు స్తున్నాయి. ఆ కన్నుల్లోకి సూటిగా చూడలేక తల



నాదోపాసన

చిత్రం — కాటూరి కృష్ణమూర్తి (నూతక్కి)

వంచుకొని రమేష్ ఆమెను సంబోధిస్తూ, "లోపలికి రా" అంటూ డ్రాయింగ్ రూంలోకి దారితీశాడు. అతని వెంటడే ఆమె లోనికి నడిచింది. అతను నేరుగా వెళ్ళి కిటికీ కర్టెన్ ప్రక్కకు తొలగించి ఊచల్ని పట్టుకొని బయటికి చూస్తూ, తన ముఖంలో వ్యక్తమయ్యే భావాల్ని దాచడానికి ప్రయత్నిస్తున్నాడు.

క్షణకాలం నిశ్శబ్దం! . . .

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ రమేష్ వెచ్చటి శ్వాస విని పించింది. "నిన్ను మళ్ళీ చూడగలుగుతా ననుకోలేదు, జా. . . న. . . కీ — కూర్చో!" అన్నాడు కష్టంగా.

"అంటే ఈపాటికి చచ్చిపోయి ఉంటుందను కున్నారు కదూ! ఒకవేళ బ్రతికిఉన్నా మీకు నేను ఏ విధంగా ఆటంకం కాను . . ." రమేష్‌కు ఈ మాటలు హృదయంలో సూటిగా గుచ్చుకున్నాయి.

"ఇప్పుడు నేను కూర్చోడానికీ, మీ మర్యాదలు స్వీకరించడానికీ రాలేదు. మీరు నన్నెందుకు దగా చేశారో తెలుసుకుందామని వచ్చాను. చెప్పండి — నన్ను పెళ్ళిచేసుకుంటానని మాట ఇచ్చి, నా జీవితంతో చెలగాటమాడి ఎందుకు మోసపుచ్చారు? . . ." అన్నది జానకి.

"లేదు. . . నేను నిన్నేమీ మోసం చేయలేదు. నిన్ను నువ్వే మోసం చేసుకొన్నావు . . ." అన్నాడు రమేష్.

"మీ రిలా మాట్లాడతారని, మీకు అంత సామర్థ్యం ఉందని నాకు తెలుసు, రమేష్! కాని ఇన్ని రోజుల తరవాత మీ మనసు కొంచెమైనా మారి ఉంటుందనుకున్నాను. కానీ నా ఊహ పొరపాటని తేలి పోయింది! . . ."

"సరే. . . నువ్విప్పు డెందుకు వచ్చావో చెప్పు. . . ?" విసుగ్గా అడిగాడు రమేష్.

"అదా . . . నువ్వింత గొప్ప రచయితవయ్యావు. ప్రియురాలు ఎందుకు వస్తుందో అర్థం చేసుకోలేవా?" బహువచన ప్రయోగం వదిలేసి ఏకవచన ప్రయోగంతో వ్యంగ్య బాణం విసిరింది.



"నువ్వెన్ని పాత్రల్ని, ఎన్ని రకాలుగా చిత్రించావో నాకు తెలుసు. రమేష్, నువ్వు చాలా తెలివిగలవాడివి. అందుకనే నన్ను సులభంగా మోసగించగలిగావు. త్యజించ గలిగావు. ఏకాంతంగా నా సర్వస్వం నీ కప్పగించి నీ ఒడి లోనే పడుకొనిఉన్నప్పుడు . . . ఇప్పటికి నాలు సంవత్సరాలు జరిగినా నాకు ఇప్పుడు జరిగినట్లు గుర్తుంది — చుక్కలతో మెరిసే ఆకాశంవంక చూస్తూ, నా బుగ్గలు నిమురుతూ ఏమన్నావు? 'పిచ్చి జానకీ, ఎందు కింత భయపడతావు . . . నువ్వు నిత్యం తువ్వవని ఎవరన్నారు . . . ? నువ్వు స్వచ్ఛందంగా మెరిసే నీలమణివి. నీ కాంతులే నా జీవితానికి వెలుగు బాటలు. నీకోసం ప్రపంచాన్నంతా ఒక్కమాటుగా ఎదిరిస్తాను. నిన్నే పెళ్ళిచేసుకుంటాను. నీవు లేని జీవితం నాకు వెన్నెల లేని రాత్రి' — అనలేదూ? . . . చదువైపోగానే పెళ్ళిచేసుకుంటావనలేదూ. . . ఆనాడు నాలో కోర్కెల్ని ఎందుకు రెచ్చగొట్టావు? చప్పగా చల్లారిపోయిన నా రక్తాన్ని తిరిగి ఎందుకు మరిగించావు . . . ? నా జీవితాన్ని నిప్పులో వజ్ర శలభంలాగ ఎందుకు మాడ్చేశావు? ఎన్నో ఆశయాలు వల్లించావు. వీరేశలింగం అడుగుజాడల్లో నడుస్తా నన్నావు. . . చివరికి ఏం చేశావు? . . . నేను తల్లిని కాబోతున్నానంటే మండిపడ్డావు. నా శీలాన్ని శంకిం చావు. నీ పాపఫలాన్ని నువ్వే మోయమన్నావు. . . అందులో నాకేమీ బాధ్యత లేదన్నావు. నేను లేనప్పుడు ఎంతమంది ప్రేమికులతో నీకు అన్నావు . . . నా కడుపులో చిన్నారి పాపకోసం నేను బ్రతకవలసివచ్చింది. కాకపోతే ఆనాడే ఆత్మత్యాగం చేసుకొని ఉందును. . ." చివరి మాటలన్నప్పుడు గొంతు గద్గదమయింది. చెరుగుతో కన్నీళ్ళను తుడుచుకొంది.

రమేష్ కిటికీ ఊచలు పట్టుకొనిఉన్నవాడల్లా వెనుదిరిగి "ఇప్పుడూ ఆ మాటే అంటాను. నువ్వే నన్ను మోసగించావు. నువ్వు నిష్కల్మషురాలవని, విమలచరితవని నమ్మాను. నేను లేనప్పుడు కామో ద్రేకంతో నువ్వు చేసిన అప్రాచ్యపు పనులకు నే నెలా బాధ్యత వహిస్తాను? నాకు మంచి కనువిప్పు కలిగిం చావు. లేకపోతే నా భవిష్యత్తేమిటి? నీకోసం నా భవి ష్యత్తు అంధకారమయమై ఉండేది. నిన్ను పెళ్ళాడి ఉంటే నే నీపాటికి ఏ అగాధాల్లోనో ఉండేవాడిని. . ." ఆవేశంగా అన్నాడు రమేష్.

"ఆపు, రమేష్. . . చాలు. . . నే చెప్పేది కాస్త విను. మనం విడిపోయి దాదాపు ఇరవై సంవత్సరాలకు పైగా అయింది. నేను ఈ ఇరవై సంవత్సరాలు ఎలా జీవితం గడిపానో తెలుసా? పతితగా — భ్రష్టురాలుగా బ్రతికాను. నువ్వు తిరస్కరించిన క్షణం నా కళ్ళు చీకట్లు కమ్మాయి. . . ఒకవంక నా దారిద్ర్యం, మరోవంక కడుపులో పెరిగే పాపాయి. . . అట్లాంటి సమయంలో ఊరు విడిచాను నేను. ఒక వ్యభిచార గృహంలో తలదాచుకోవలసివచ్చింది. సమాజంపైనా, సంస్కృతిపైన తీవ్రమైన కక్ష ఏర్పడింది. అది ఎలా తీర్చుకోవాలి? . . . నన్ను నేను శిక్షించుకోవడం ద్వారా సమాజాన్ని శిక్షించాలనుకున్నాను. అందుకే సంఘంలోని కుళ్ళుకు, అన్యాయానికి ప్రతిబింబంలా ఉండాలనుకున్నాను. చీకటిగుహల్లో, వ్యభిచార

(తరువాయి 63 వ పేజీలో)

గృహాల్లో చెప్పలేనంత నీచమైన జీవితాన్ని గడిపాను. కాని ఒక్కటిమాత్రం నిజం. ఆ తప్పు కేవలం నాది కాదు. నీది. నువ్వానాడు నాకు ఆశ్రయం కల్పించి ఉంటే నే నీనాడు ఈ స్థితికి దిగజారేదాన్నికాదు. ఈ ఇరవై సంవత్సరాలు ఎన్నో బాధలు అనుభవించాను. బాధల్లోనే ఆనందం చవిచూడగలిగాను. విన్ను విడిచిన అయిదు మాసాల్లో బాబు పుట్టాడు. వాడికి విద్యాబుద్ధులు చెప్పించాను. వాడి నాన్న మెత్తటి పరుపుల్లో పడుకుంటే వాణ్ణి కటికనేలమీద పడుకోబెట్టి నిద్రపుచ్చాను. వాళ్ళ నాన్న పెద్ద డాక్టరై — పెద్ద రచయితగా పేరు తెచ్చుకుంటూ ఉంటే వ్యభిచరించి వాళ్ళమ్మ వాడికి తిండి పెట్టవలసి వచ్చింది. తల్లిగా తన బాధ్యత తీర్చుకోవలసివచ్చింది. నే నిప్పుడు నాకోసం నీ ప్రేమ నర్థించడానికి రాలేదు. నీ ప్రేమ బాబుమీద చూపించమని అర్థించడానికి వచ్చాను. నలుగురికీ తెలిసేలా కాకపోయినా నీ మనసులో నైనా వాణ్ణి నీ బిడ్డగా గుర్తిస్తే చాలు . . . నా కంతకన్నా కావలిసిందేమీ లేదు. . . !"

"ఆ విషయానికి నేను ఇదివరకే సమాధానం చెప్పాను. ఆ విషయం మళ్ళీ కెలకవద్దు... మళ్ళీ నన్నా ఊబిలోకి లాగకు . . . సంఘంలో కొంచెం మర్యాదగా జీవిస్తున్నా. . . నా మర్యాద మంటగలుపుకోలేను. ఒక వెలయాలి బిడ్డని నా బిడ్డగా గుర్తించలేను. . .! నువ్వా ఆశ వదులుకో, జానకీ" అన్నాడు.

ఈ మాటలతో జానకిలో చల్లబడ్డ రక్తానికి వేగం హెచ్చింది. కోపంతో కంఠనాళాలు ఉబ్బాయి. ఆపుకోలేని ఉద్వేగంతో అన్నది:

"రమేష్! నీ కథల్ని ఎప్పటికప్పుడు చదువుతున్నాను. నీ కథల్లో ఉన్నంత సంస్కారం నీలోలేదు. కథలద్వారా పాఠకులకు కనిపించే రమేష్ వేరు. నువ్వు వేరు. . . ఇద్దరూ విభిన్న వ్యక్తులు. నువ్వు నీ రచనలతో ప్రజల్ని మోసగిస్తున్నావు. సంస్కారివిగాను, సహృదయుడివి గాను చలామణి అవుతున్నావు. రచయితగా నువ్వు పనికి రావు. చిత్తశుద్ధిలేని నీ రచనలు మేలుకంటే కీడే ఎక్కువ కల్గిస్తాయి. నీ హృదయంలో అనేకమయిన చీకటి కోణాలున్నాయి. అవెప్పుడూ వెలుగు చూడలేవు. ఛీ... ఛీ... నీలో మానవత్వం ఉందనుకోవడం ఎండమావిలో నీరుంటుందని భ్రమించడమే!" . . . అంటూ ఉండగా జానకి నుదుటికి బలంగా ఏదో తగిలి గాయమై రక్తం చిందింది. రమేష్ అవధులు దాటిన కోపంతో సమీపంలో ఉన్న పేపర్‌వెయిట్ జానకిమీదికి విసిరాడు. జానకి గాయం తగిలినచోట చేతితో అదిమి పట్టుకున్నది.

"కొట్టారా . . . ? ఫరవాలేదు. మీరు నా హృదయానికి చేసిన గాయంకన్నా ఈ గాయం ఏమంత పెద్దది కాదు. త్వరలోనే మాసిపోతుంది. కాని మీలోని కుసంస్కారానికే నాకు విచారం... వస్తాను!" అంటూ గదిలోంచి బయటికి నడిచి మెట్లు దిగి చీకట్లో కలిసి పోయింది.

రమేష్ దాదాపు నిశ్చేష్టుడై, ఉన్నచోటే చాలసేపు కుర్చీలో కూలబడిపోయాడు. వర్షం జోరు హెచ్చింది. భయంకరమైన నిశ్శబ్దత గుండెలను తూట్లు పొడు స్తూంది.

రమేష్‌కు ఆ రాత్రి అంతా నిద్ర పట్టలేదు. మన

# మేడిపండు

(11 వ పేజీ తరువాయి)

స్సంతా కలతబారిపోయింది. ఎప్పుడు ప్రాగన్ను పట్టినా జానకి, తను గడిపిన మధురక్షణాలు, జానకిని తను దూరంచేయడం. . . జానకి రూపం . . . తను అన్న మాటలు. . . దాదాపు పిచ్చెక్కినంత పని చేశాయి. పొద్దున చాలసేపటివరకు పడకమీదినించి లేవలేక పోయాడు. శరీరంలోని సత్తువఅంతా ఒక్కసారిగా ఎవ్వరో లాగివేసినట్లుంది. ఎవరడిగినా ఏమీ సమాధానం చెప్పలేదు.

ఆ రోజు సాయంత్రం టపాలో ఉత్తరం వచ్చింది. చించి చదివాడు.

"శ్రీ రమేష్ గారికి నమస్కృతులు.

జీవితంలో నేను ఎవర్నీ ఏ విధంగానూ మోసగించ లేదు. జీవితమే నన్ను మోసగించింది. అయినా నేను నిరుత్సాహపడలేదు. మీరు నన్ను మోసగించిన తరవాత నేను బ్రతుకుకోసం శరీరాన్ని అమ్ముకొన్నానని చెప్ప డానికి కించపడటంలేదు. మిమ్మల్ని నిన్న కలుసుకున్న తరవాత దాదాపు మానిపోయిన గాయం మళ్ళీ పుం డయింది. జీవించాలన్న వాంఛ పూర్తిగా నశించింది...

బాబుకు ఎలాగో ఇంతవరకు చదువు చెప్పించాను. నా సర్వస్వం వాడికి వెచ్చించాను. కాని ఒక్క లోటు మాత్రం తీర్చలేకపోయాను. వాడు తన తండ్రి ఎవ్వరో చూపించమన్నప్పుడు నిరుత్తరురాలినయ్యాను. నా గుండెకోత వర్ణించడానికి నాకు మాటలు రావు. ఇంత గొప్ప రచయితలైన తరవాత మీలో కొంత మార్పు ఉంటుందని ఊహించాను. నా ఊహ పొరపా టని తేలింది. నేనిక బ్రతకడం అనవసరం. ఇప్పటికి గడించిన అనుభవం చాలు! అందుకనే నేను మీ కీ ఉత్తరం చేరే లోపున నే నీ ప్రపంచానికి శాశ్వతంగా దూరమైపోతాను. కాని నా కొక అవకాశం ఉంది. మీమీద పగ తీర్చుకోవాలంటే నా దగ్గర ఎన్నో ఆధారాలున్నాయి. మీరు, నేను కలిసి తీయించుకున్న ఫోటోలు, ప్రేమలేఖలు, ఇంకా ఎన్నో ఉన్నాయి. నా పరిస్థితులకు కారణాలు తెలుపుతూ, సాక్ష్యాలతో మీ దుర్మార్గాన్ని ప్రపంచానికి చాటగలను. మీ కీర్తి ప్రతిష్ఠలను నిమిషంలో మట్టిపాలు చేయగలను. కానీ నాలో ఇంకా మానవత్వం మిగిలిఉంది. పగ నాలో మిగిలిన మానవత్వాన్ని చంపలేకపోయింది. అందుకనే ఈ ఆత్మత్యాగం. మీలో ఇంక ఏ కొంచెమైనా మానవత్వం మిగిలిఉంటే మీ బిడ్డను చేరదీయండి. వాడు ఉస్మానియా మెడికల్ కాలేజీలో సెకండియర్ మెడిసిన్ చదువుతున్నాడు. పేరు కరుణాకర్.

చివరి మాట. నా అనుభవాల్ని పురస్కరించుకొని 'పతిత ఆత్మకథ' అనే నవల రాశాను. అందులో మీలాంటి పాత్ర ఒకటుంది. అతనే కథానాయకుడు. దాన్ని నవలల పోటీకి పంపించాను. దాన్ని నాలాటి అభాగ్యజీవులకు అంకితమిచ్చాను. ఎప్పుడైనా దాన్ని ఒకసారి చదవండి.

ఇంతకన్నా వ్రాయలేను.

ఇట్లు మీ,
—జానకి."

ఉత్తరం ముగించేసరికి రమేష్ కనుకొలకుల్లో అస్పష్టంగా రెండు కన్నీటిబొట్లు నిలిచాయి.

'అవును. నేను నిజంగా పాపిష్ఠివాణ్ణే. నా పాపానికి జానకి బలిఅయిపోయింది. ఇన్ని రోజులు నాలో ఉందను కున్న మానవత్వం ఏమైంది?' వాపోయాడు.

మరునాటి దినపత్రికలో జానకి అనే ఒక స్త్రీ తన మరణానికి ఎవ్వరూ కారకులుకారని వ్రాసిపెట్టి ఆత్మహత్య చేసుకొందని, పైగా ఆమె వ్రాసిన 'పతిత ఆత్మకథ' అనే నవలకు పోటీలో ప్రథమ బహుమతి లభించిందని, ఈ విషయం తెలిసేలోగానే ఆమె మరణిం చిందనీ, ఆమె నవలలోని పాత్రల్ని పరిశీలిస్తే ఆమె ఆశావాది అని తెలుస్తుందని, ఆమె ఆత్మహత్య చేసుకో డానికి బలమైన కారణాలు, నిరాశ ఆమెను జయిం చిన విధం తెలియడంలేదనీ ప్రకటనకూడా జరిగింది.

ప్రకటన చదివిన కొంతసేపటికి రమేష్ డ్రాయరు లోంచి కాగితం, కలం తీసి కంపితహస్తాలతో ఇలా వ్రాశాడు:

"అఖిల భారత సాహిత్య సదస్సు కార్యదర్శికి

మీ ప్రయత్నానికి నా హృదయపూర్వక వందన ములు. కాని ఒక్క మాట. మీ సన్మానానికి నేను అనర్హుణ్ణి. దయచేసి మీ ప్రయత్నం విరమించండి. మీకు నిరాశ కలిగించవలసివచ్చినందుకు విచారిస్తు న్నాను.

—ఇట్లు, భవదీయుడు,
రమేష్." ★


దేహపుష్టికి
ఆరోగ్యానికి
పండిత-డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్)లిమిటెడ్
మదరాసు-17.

3 నెలలవరకు ఉచిత బహుమతి



స్త్రీల సౌందర్యము కాశ్మీర్ ఆర్టుచీరెలు ఆకర్షణీయమైన సరికొత్త డిజైను, రంగులలో సీజనుకు తాజాగావచ్చినవి. పెద్ద సైజు. మా వద్ద మాత్రమే ఉన్నవి. వెల డీలక్స్‌చీరె 1 రు. 11/- లు, 2 చీరెలు రు. 20/-లు, 3చీరెలు రు.28.లు, 4 చీరెలు రు.36/-లు, రెండు లేక ఎక్కువ చీరెలు ఆర్డరిచ్చినవారికి ఒక బ్లౌజు ముక్క ఉచితం.ఆర్డర్లు పోస్టుద్వారాపంపబడును

**ARVIND AGENCIES (AP-22)**
**Post Box 1408, Delhi-8.**